
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

బుధవారం 27 మార్చి 2024

మంగళవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.6° C | కనిష్ఠం : 20.4° C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.35 గం..

సహర్ : గురువారం ఉ : 4.51 గం..



ఆత్మ ఘోష!

మూలనపడిన వ్యవసాయ సాంకేతిక పథకం

- మూడేళ్లుగా నిధులు రాక నీరసం
- రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలకు బ్రేక్
- ఇతర విధుల్లోకి ఆత్మసిబ్బంది..
- నీరుగారుతున్న పథకం లక్ష్యం

హనుమకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) నిధులు లేక నీరిసించిపోతోంది. ఎలాంటి కార్యక్రమాలు లేక నామావశిష్టంగా మారిపోయింది. పట్టించుకునేవారు లేక ఘోషిస్తోంది. ఆత్మ ఆధ్వర్యంలో రైతులను చైతన్యవంతం చేసేందుకు సదస్సులు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆ దిశగా ఎలాంటి కృషి జరగడం లేదు. యంత్రాలు కొనుగోలు చేసినప్పటికీ వాటిపై అవగాహన కల్పించేవారే లేరు. వరి, పత్తి, కందులు, పెసర, శనగ తదితర పంటలతో పాటు మామిడి, జామ, దానిమ్మ తోటలను పెంచుతున్నవారికి సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆత్మసంస్థను ఏర్పాటు చేశారు. కానీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆత్మ ఏర్పాటు లక్ష్యం నీరుగారిపోతోంది.

శిక్షణే లక్ష్యం

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో జిల్లా వ్యవసాయ శాఖకు అనుబంధంగా ఆత్మ ఏర్పాటు చేశారు. ఒక విధంగా వ్యవసాయ శాఖలో ఆత్మ అంతర్భాగం. వ్యవసాయ శాఖ సిబ్బంది పంటల సాగు, విస్తీర్ణం, సస్య రక్షణ చర్యలు, పంటల సర్వే, పంట మార్పిడీపై అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలను పర్యవేక్షిస్తే.. ఆత్మ వ్యవసాయరంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక మార్పులను రైతులకు ఎప్పటికప్పుడు తెలియచెప్పడం ఆత్మ పని. 2006లో ప్రారంభమైన ఈ పథకం కింద కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయాధికారి కన్వీనర్‌గా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. డివిజన్‌స్థాయిలో ఈ కమిటీలు ఉండేవి. అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతులకు సాగుపై అవగాహన కల్పించేవారు. పశు సంవర్థక శాఖ, ఉద్యాన, మత్స్యశాఖల్లో సాంకేతికంగా వచ్చే అనేక మార్పులకు సంబంధించిన అంశాలు అధికారులు వివరించేవారు. ప్రస్తుతం ఇవేం జరగడం లేదు. ఇప్పుడు కమిటీలు కూడా ఏమీ లేవు. దీనికి ఇది వరకు చైర్మన్ కూడా ఉండేవారు. ఇప్పుడు ఎవరూ లేరు. దీంతో ఈ పథకం ఉందన్న విషయం చాలా మంది రైతులకు తెలియని పరిస్థితి. కార్యాలయం ఎక్కడ ఉంది? దానిలో ఎంత మంది పని చేస్తారు? వారి ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలుగుతుంది? అనే అంశాలపై చాలా మంది రైతులకు ఇప్పటివరకు అవగాహన లేదు. మూడేళ్ల కిందట ఆత్మ చురుకుగానే పని చేసేంది. ఆ తర్వాత దాని కార్యక్రమాలు అటకెక్కాయి. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలోనే ఒక మూల ఆత్మ పడి ఉంటోంది. ఇది వరకు బోర్డులైన ఉండేవి. ఇప్పుడు అవి కూడా లేవు.

ఊసేలేని కార్యక్రమాలు..

వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశుసంవర్థక, పట్టు పరిశ్రమలు, మార్కెటింగ్ శాఖల భాగస్వామ్యంలో రైతులకు శిక్షణ, అంతర్ జిల్లా, అంతర్రాష్ట్రాలకు విజ్ఞాన యాత్రలు నిర్వహించాలి. వ్యవసాయ ప్రదర్శనలు, సాగు విస్తరణ కార్యక్రమాలు, పొలం బడులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థ నిర్వహించే వ్యవసాయ, అనుబంధరంగాల కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి. వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ విశ్వవిద్యాలయాల సహకారంతో ఆధునిక సాంకేతికతను రైతులకు అందించాలి. అవసరానికి అనుగుణంగా కొత్త విధానాలను విస్తరించడం, క్షేత్ర దినోత్సవాలను, కిసాన్ గోష్ఠి, రైతు-శాస్త్రవేత్తల గోష్ఠి లాంటి కార్యక్రమాలను నిర్వహించాలి. కానీ ఇవేమీ జరగడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.30 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, మొక్క జొన్న, మిర్చితోపాటు మరో లక్ష ఎకరాల్లో పండ్లతోటలు, కూరగాయల తోటలు సాగవుతున్నాయి. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి పండుతున్నాయి. ఈ పంటల సాగులో ఇటీవల అనేక మెరుగైన పద్ధతులు వచ్చినా వాటి గురించి తెలియక రైతులు పాత పద్ధతులనే అనుసరిస్తున్నారు.



సిబ్బంది ఉన్నా.. పని లేక..

ఆత్మకు జిల్లా వ్యవసాయాధికారే ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా వ్యవహరిస్తారు. డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ (డీపీడీ)తో పాటు ఒక ప్రోగ్రామ్ ఆపరేటర్, ఒక సీనియర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజర్ (ఏటీఎం), బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ (బీటీఎం) ఆత్మ సంస్థలో ఉంటారు. వీరిలో ఏటీఎం, బీటీఎంలు కాంట్రాక్టు ఉద్యోగులు కాగా మిగతా వారు రెగ్యులర్ సిబ్బంది. వీరు వ్యవసాయంలో చోటుచేసుకున్న ఆధునిక పద్ధతుల పట్ల రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాల్సి ఉంటుంది. కానీ మూడేళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుల కోసం ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించడం లేదు. టూర్ ప్రోగ్రాంలు లేవు. క్షేత్ర సందర్శనలు అసలే లేవు. పొలం బాటలు ఏ మాత్రం కానరాడం లేదు. శాస్త్రవేత్తలతో రైతులకు ఇష్టాగోష్ఠి ఊసే లేదు.

మూడేళ్ల నుంచి నిధులు లేవు

రైతులు, వారి సంక్షేమం అంటూ ఊదరగొట్టిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆత్మను ఏ మాత్రం పట్టించుకోలేదు. మూడేళ్లుగా ఆత్మ పథకం కోసం ఒక్క పైసా ఇవ్వలేదు. గతంలో ఏటా రూ.5లక్షల వరకు నిధులు ఇచ్చేది. ఇతరత్రా వ్యవసాయ కార్యక్రమాలకు కూడా ప్రభుత్వం నుంచి నిధులందేవి. ఆ లెక్కన ఉమ్మడి జిల్లాకు రూ.30లక్షల వరకు వచ్చేవి. 2020 నుంచి నిధులు ఇవ్వడం నిలిపివేసింది. దీనితో నిధుల లేక ఆత్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం ఆగిపోయింది. మూడేళ్లలో ఒకే ఒక్క రైతు టూర్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు 50 మంది రైతులతో క్షేత్రసందర్శన నిర్వహించారు. అది కూడా వ్యవసాయశాఖ నిధులతోనే. ఆ తర్వాత రైతు అవగాహన కార్యక్రమాల ఊసే లేదు. ఆ మధ్య వ్యవసాయరంగంలో ఆధునిక పద్ధతులపై శిక్షణ కోసం ఆ మధ్య వ్యవసాయాధికారులతో బ్రెజిల్ పర్యటన నిర్వహించారు. అది కూడా వ్యవసాయశాఖ నిధులతో నిధుల లేక, చేసేందుకు పని లేకపోవడంతో కూడా ఇటీవల వ్యవసాయ శాఖలోకి ఏఈవోలుగా పంపించారు.

పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ పూర్తి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 26: పోలింగ్ సిబ్బందికి మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తయినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 809 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మొత్తం 4338 మందికి మొదటి ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో 1,072 ప్రిసైడింగ్ అధికారులు, 1,082 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2,184 మంది ఇతర పోలింగ్ అధికారులు ఉన్నట్లు వివరించారు. ప్రతి టీమ్‌లో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు ఇతర పోలింగ్ ఆఫీసర్లు ఉంటారన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 25 శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని అన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా నియమించిన వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, ఎన్ఐసీ అధికారి అప్పిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి: సీఎస్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 26: యాసంగి ధాన్యాన్ని ప్రణాళికబద్ధంగా మద్దతు ధరపై కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు, వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రణాళికపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ వరి పంట కోతకు వస్తున్న నేపథ్యంలో జిల్లాస్థాయిలో వరి కోతల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరిస్తూ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. అధికారులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం చేయాలని, ప్రజాప్రతినిధులు పాల్గొన రాదని సూచించారు. తాగునీటి సరఫరాలో వచ్చే చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, గ్రామం, మునిసిపల్ వార్డు స్థాయిలో తాగునీటి సరఫరాకు ప్రణాళికలు రూపొందించాలని సీఎస్ తెలిపారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ ప్రసాద్‌రావు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, అధికారులు పాల్గొన్నారు.

టెట్..హాట్ గురూ..

- భారీగా పెరిగిన ఫీజుతో బెంబేలెత్తిపోతున్న అభ్యర్థులు
- ఈసారి టెట్‌లో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అవకాశం

వివరాలు : 7లో

వసూళ్లపై నిఘా వర్గాల ఆరా

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై చర్చ

వరంగల్ క్రైం, మార్చి 26: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఒక పోలీస్ అధికారి అక్రమాలపై మంగళవారం 'భారీగా వసూళ్లు' అనే కథనం ఆంధ్రజ్యోతి ప్రచురించింది. రోజువారిగా నిర్వహించే సెట్ కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆంధ్రజ్యోతి కథనంపై ప్రధానంగా పోలీస్ ఉన్నతాధికారి ప్రస్తావించినట్లు తెలిసింది. కాగా, నిఘా వర్గాలు ఆంధ్రజ్యోతి కథనంపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు సమాచారం. కాకతీయ యూనివర్సిటీ పోలీసుల సహకారంతో నిఘావర్గాలు సదరు అధికారి ప్రమేయం ఉన్న భూ ఆరోపణలు, అతడికి సహకరించిన అధికారుల గుట్టు రట్టు చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. మొత్తంగా ఆంధ్రజ్యోతి కథనం పోలీస్ శాఖలో ప్రకంపనలు సృష్టించింది.

ప్రశాంతంగా పదోతరగతి వార్షిక పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 26: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిన ఫిజికల్ సైన్స్ పరీక్షకు వరంగల్ జిల్లాలో 99.86 శాతం మంది విద్యార్థులు హాజరు కాగా, హనుమకొండ జిల్లాలో 99.88శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 9,455 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 9,442 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. ఇక హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 12,032 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 12,018 మంది హాజరుకాగా 14 మంది గైర్హాజరయ్యారు. రెండు జిల్లాల డీఈవోలు డి. వాసంతి, డాక్టర్ అబ్దుల్‌హై పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

నీటి లీకేజీల నివారణకు చర్యలు చేపట్టండి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26: నగరంలో ప్రతీ కాలనీలో నీటి లీకేజీని అరికట్టడానికి అధికారులు చర్యలు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ట్రయల్ అండర్ ఎర్రర్‌లో భాగంగా ప్రతీకాలనీ చివరివరకు నీ రందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కొత్త ప్రాంతాల్లో నీటి సరఫరాలకు వాల్వులు బిగించి నీటిని వదలాలని అన్నారు. ప్రధానంగా లీకేజీలపై దృష్టి సారించాలని అన్నారు. పాత పైపులు, రోడ్లపై నిర్మాణాలు చేపట్టడం వల్ల నీటిపైపులు పగిలే అవకాశాలు ఉన్నాయని, వాటిని ముందస్తుగా గుర్తించాలని అన్నారు. నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడితే ముందస్తుగా ప్రత్యామ్నాయ పద్ధతులు చేపట్టాలని సూచించారు. 66 డివిజన్‌ల పరిధిలో నీటిపరంగా సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాలన్నారు. డివిజన్‌లలో ఉన్న చేతి పంపులను మరమతులు చేయాలని అన్నారు. ప్రత్యామ్నాయంగా ట్రాక్టర్ల ద్వారా నీటిని అందించాలని సూచించారు. ఇంకా 25 వరంగల్‌లో, 25 హనుమకొండ పరిధిలో వేసవి తాపం తీర్చేందుకు 50 చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డివిజన్‌ల వారిగా ఏర్పాటు చేసిన మైక్రోప్లాన్‌పై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఈఈలు ప్రవీణ్‌చంద్ర, ఈఈలు బీఎల్ శ్రీనివాసరావు, రాజయ్య, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, డీఈలు సిరిమల్లె సారంగం, రవి కుమార్, రవికిరణ్, రంగారావులతో పాటు ఏఈలు పాల్గొన్నారు.

భవన నిర్మాణదారులు నిబంధనలు పాటించండి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మిస్తున్న భవన నిర్మాణదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. మంగళవారం వరంగల్ నగరంలోని ఆకుతోట కన్వెన్షన్ హాల్, ఉర్సుగుట్ట సమీపంలోని వాల్‌మార్ట్, పాత బీటుబజార్ ప్రాంతంతో పాటు ప్రాంతాల్లో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న భవనాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిబంధనలు పాటించి నిర్మిస్తున్న భవనాలకు మాత్రమే అనుమతులు ఇస్తామని, లేదంటే కూల్చివేస్తామని హెచ్చరించారు. 2019 మున్సిపల్ చట్టం ప్రకారం ఎలాంటి డీవియేషన్ లేకుండా నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ బానోతు వెంకన్న, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, టీపీవోలు సుష్మ, బషీర్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు సంపత్ రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నా..

ప్రజాశాంతి పార్టీ నేత, సినీనటుడు బాబూమోహన్ విశాఖలో విలేకరుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బాబూమోహన్

అక్కయ్యపాలెం (విశాఖపట్నం), మార్చి 26: తాను వరంగల్‌లో లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు ప్రజాశాంతి పార్టీ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు, సినీ నటుడు బాబూమోహన్ వెల్లడించారు. నగరంలోని రైల్వేన్యూకాలనీలో గల పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను గతంలో టీడీపీ, బీజేపీల తరఫున ప్రచారం చేసి ఆ పార్టీల గెలుపునకు ఎంతో కృషి చేశానని పేర్కొన్నారు. తాను ఎంపీగా పోటీ చేయాలనే ఉద్దేశంతో బీజేపీలో చేరానని, కానీ ఆ పార్టీ మోసం చేసిందన్నారు. దాంతో ఆ పార్టీకి రాజీనామా చేసి, ప్రజాశాంతి పార్టీలో చేరానన్నారు. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ విశాఖపట్నం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయబోతున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జిలుకర రవికుమార్, ఇతర జిల్లాల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు.



కొమ్మాల స్టేజి వద్ద కాంగ్రెస్ పార్టీ ప్రభబండ్ల ఎదుట మహిళల కోలాటం



భక్తజన సంద్రంగా కొమ్మాల జాతర

- హోరెత్తిన రాజకీయ ప్రభల జోరు
- గిర్నిబావిలో ట్రాఫిక్ జాం
- ఇబ్బందులు పడిన భక్తులు, ప్రయాణికులు
- దైవదర్శనం చేసుకున్న లక్షమందికిపైగా భక్తులు

7 లో..

తగ్గిన పుచ్చసాగు..

- రెండేళ్లుగా తగ్గుతూ వస్తున్న పంట
- జిల్లావ్యాప్తంగా కేవలం 43 ఎకరాల్లోనే సాగు..
- దిగుబడి లేక భారీగా పెరిగిన ధరలు

నర్సంపేట, మార్చి 26 : జిల్లాలో ఈ ఏడాది పుచ్చకాయల పంట సాగు ఘననీయంగా తగ్గిపోయింది. గతంలో జిల్లాలో 300 నుంచి 500 ఎకరాల్లో పంట సాగయ్యేది. ఈ ఏడాది కేవలం 43 ఎకరాల్లో సాగు చేశారు. నర్సంపేట మండలంలో 8 ఎకరాలు, నల్లబెల్లిలో 2 గుంటలు, ఖానాపురంలో 3 ఎకరాలు, నెక్కొండ ఎకరం 13 గుంటలు, చెన్నారావుపేట మండలంలో 3 ఎకరాలు, సంగెం మండలంలో 17 ఎకరాల 6 గుంటలు, వర్ధన్నపేట 5.30 ఎకరాలు, రాయపర్తి 5ఎకరాల 31 గుంటలు, పర్వతగిరిలో 8ఎకరాల 6 గుంటల స్థలంలో పుచ్చకాయ సాగచేసినట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో లాభాలు తెచ్చిపెట్టే పంట కావడంతో గతంలో రైతులు ఎక్కువగా ఉత్సాహం చూపేవారు. దీనికి తోడు వేసవిలో పంట చేతికి వస్తుండడంతో మార్కెట్‌లో ధర కూడా గిట్టుబాటు అయ్యేది.



నర్సంపేటలో రోడ్డుపై పుచ్చకాయల విక్రయం

తెగుళ్ల బెడద..

పుచ్చకాయ పంటకు ఎక్కువగా తెగుళ్ల ఆశిస్తుండడంతో రైతులు గత రెండేళ్ల నుంచి సాగుకు అంతగా ఆసక్తిచూపడం లేదని తెలుస్తోంది. ధైర్యంచేసి సాగుచేసినా.. ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో తీవ్రం గా నష్టపోతున్నారు. దీంతోఈసారి ఎక్కువ మం ది రైతులు పత్తి, మిర్చి, మొక్కజొన్న సాగుకు మొగ్గు చూ పారు. వరంగల్, ఇతర ప్రాంతాల నుంచి పుచ్చకాయ లను కొనుగోలుచేసి కొందరు అమ్మకాలు జరుపుతున్నారు.

వేసవిలో ఉపశయనం

వేసవి కాలంలోనే కాకుండా ప్రతీ కాలంలో ప్రజ లు పుచ్చకాయలను ఎంతో ఆసక్తితో తింటారు. ఉచితోపా టు, ఎన్నో పోషక విలువలు కలిగిన పుచ్చకాయలను తినేందుకు ప్రతీ ఆసక్తిని చూపుతుంటారు. వేసవి తా పం నుంచి ఉపశయనం పొందడానికి పుచ్చకాయ ఎం తో ఉపయోగంగా ఉంటుంది. ఇకనైనా వ్యవసాయాధికారులు రైతుల్లో చైతన్యం కలిగించి పంట సాగు పెరి గేలా చూడాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ధరలు మంట

దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో పుచ్చకాయల ధరలు మండుతున్నాయి. ఒక్కో పుచ్చకాయను రూ.60 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. గతంలో కాయ సైజును బట్టి అమ్మేవారు. ఈ ఏడాది కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. ధరల పెరగడంతో సామాన్యులు వాటి జోలికి వెళ్లడం లేదు. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వరంగల్ పండ్ల మార్కెట్‌కు పుచ్చకాలు దిగుమతి అవగా.. అక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా పల్లె, పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. స్థానిక మార్కెట్‌కు పుచ్చకాయలు రాకపోవడంతో రవాణా ఖర్చులు పెరిగి ధరలు కూడా మండుతున్నారు. ఇప్పటికే మార్కెట్లలో, ప్రధాన రహదారుల వెంట వ్యాపారులు దాపు రెండు కిలోల నుంచి ఏడు కిలలోలు ఉన్న పుచ్చకాయల్ని అమ్ముతున్నారు.



వినాయక్‌నగర్‌లో మహిళ అదృశ్యం

వరంగల్ క్రైం, మార్చి 26: మతిస్థిమితం లేని మేకల లక్ష్మి(34) అనే మహిళ అదృశ్యం అయిన సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్టేషన్‌పరిధిలోని వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న లక్ష్మి సోమవారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమెకు మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ విషయాన్ని కేయూ ఎస్‌ఐ రాజ్‌కుమార్ ధ్రువీకరించారు. లక్ష్మి మామ మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.



పడిపోయిన రెడీమిక్స్ వాహనాన్ని తీస్తున్న సిబ్బంది

రెడీమిక్స్ వాహనం బోల్తా

డ్రైవర్‌కు స్వల్పగాయాలు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26: హనుమకొండ కేయూ రోడ్డులోని ఈదులవాడు బ్రిడ్జి కింద మురుగుకాల్వలో రెడీమిక్స్ వాహనం బోల్తా పడింది. వాహనం నడుపుతున్న డ్రైవర్ బయట దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

హనుమకొండ బొక్కలగడ్డ నుంచి ఈదులవాగు ఇటీవల వరద నీరు ఉధృతం కావడంతో ఇళ్లలోకి నీరు చేరుకున్నాయి. అధికారులకు ప్రజలు మొరపెట్టుకోవడంతో మురుగు నీటి కాల్వను వెడల్పు చేసే పనిలో పడ్డారు. అంతేకాకుండా ప్రధాన మురుగుకాల్వ పక్కన ఎత్తుగా ప్రహరీని నిర్మిస్తున్నారు. ఈ గోడ నిర్మాణ పనులు చేసేందుకు మంగళవారం కాల్వలోకి టిప్పర్‌లు, లారీలతోపాటు రెడీమిక్స్ వాహనాన్ని కూడా దింపారు. అయితే రెడీమిక్స్‌లో కంకర కలిపి పోస్తుండగా ఎక్కువ బరువును తట్టుకోలేక బురదలో కుంగిపోయి బోల్తా కొట్టింది. ఇది గమనించిన చుట్టుపక్కల వాళ్లు కేకలువేశారు. వెంటనే ప్రమాదాన్ని గమనించి డ్రైవర్ వాహనం నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. అక్కడే ఉన్న ఇంజనీరింగ్ అధికారులు గమనించి ప్రమాదంలో ఎవరూ చిక్కకుండా చొరవ చూపారు. వెంటనే క్రేన్ సహాయంతో పడిపోయిన రెడీమిక్స్ వాహనాన్ని నిలబెట్టారు. ఎవరికీ ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా, ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

వడ్డేపల్లి, మార్చి 26 : తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్, మైనారిటీ సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1 సర్వీసెస్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల గడువును ఏప్రిల్ 9 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం సెల్ నంబర్ : 73309 90322 లో సంప్రదించాలని ఆయన కోరారు.

30న కేయూ అకడమిక్ సెనెట్ సమావేశం

కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయ యూనివర్సిటీ 39వ అకడమిక్ సెనెట్ సమావేశంలో మార్చి 30న శనివారం ఉదయం 11 గంటలకు కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ అకడమిక్ సెనెట్ సభ్యులు, డీన్లు, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులు హాజరుకావాలని కోరారు. కాగా, గతంలో మార్చి 28న కేయూ అకడమిక్ సెనెట్ సమావేశం ఉంటుందని ప్రకటించి అనివార్యకారణాల వల్ల 30కి వాయిదా వేశారు.

పలువురికి జరిమానా

హనుమకొండ టౌన్, మార్చి26: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ 12 మంది వాహనదారులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 10 మందికి జరిమానా విధించారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.14,100, డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులో 10 మందికి రూ.8,800 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. అదే విధంగా వాహనాలు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ 10 మంది మైనర్లకు రూ.9,700 జరిమానా విధించామన్నారు.

రాజనీతిశాస్త్ర విభాగాధిపతిగా సంకినేని వెంకట్



కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర నూతన ఇన్‌చార్జి విభాగాధిపతిగా కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ సంకినేని వెంకట్‌ను నియామిస్తూ మంగళవారం కేయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.నరసింహాచారి ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ సంకినేని వెంకట్ 2004లో రాజనీతిశాస్త్ర విభాగంలో పార్టుటైమ్ అధ్యాపకులు నియమితులయ్యారు. 2009లో కాంట్రాక్టు అధ్యాపకుడిగా పదోన్నతి పొందారు. డాక్టర్ వెంకట్ జాతీయ సదస్సుల్లో 12 పరిశోధన పత్రాలను ప్రచురించారు. ఇప్పటి వరకు రాజనీతిశాస్త్ర విభాగం ఇన్‌చార్జి విభాగాధిపతిగా పనిచేసిన డాక్టర్ కె.వీరాస్వామి తప్పుకోవడంతో ఖాళీ ఏర్పడింది. నూతన విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ మార్చి 27న రాజనీతిశాస్త్ర విభాగంలో బాధ్యతలు చేపడుతారు. నూతన విభాగాధిపతిగా నియమితులైన డాక్టర్ సంకినేని వెంకట్‌ను పలువురు బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకులు అభినందించారు.


టెట్.. హాట్ గురూ..

- 5 రెట్లు పెరిగిన దరఖాస్తు ఫీజు
- భారీగా పెరిగిన ఫీజుతో బెంబేలెత్తిపోతున్న అభ్యర్థులు
- ఈ సారి టెట్‌లో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అవకాశం
- ప్రత్యేక టెట్ నిర్వహించాలని అంటున్న ఇన్‌సర్వీస్ టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 26: టెట్ దరఖాస్తు ఫీజు అభ్యర్థులకు ట్రెట్‌గా మారింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉపాధ్యాయ ఉద్యోగార్థులను ఉసూరుమనిపిస్తోంది. గతంతో పోలిస్తే దరఖాస్తు ఫీజును ప్రభుత్వం 5రెట్లు పెంచడంతో దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు బెంబేలెత్తిపోతున్నారు. గత ప్రభుత్వం టెట్ ప్రకటనల్లో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు దరఖాస్తు ఫీజులో రాయితీలు ప్రకటిస్తే ఇప్పుడు మాత్రం ప్రభుత్వం మెండిచేయి చూపడంతో అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు. భారీగా ఫీజు పెంచడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యోగార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈసారి టెట్‌లో ఇన్‌సర్వీస్ టీచర్లకు అవకాశం కల్పించారు. పదోన్నతుల కోసం ప్రభుత్వం ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌లో అర్హత సాధించాలనే నిబంధన పెట్టడంతో వారికి టెట్ తిప్పలు తప్పడం లేదు. అయితే రెగ్యులర్ వారితో కాకుండా పని చేస్తున్న పంతుళ్లకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పెరిగిన దరఖాస్తు ఫీజు

గతంతో పోలిస్తే టెట్ దరఖాస్తు ఫీజును ఈ సారి ప్రభుత్వం 5 రెట్లు పెంచింది. గతంలో దరఖాస్తు ఫీజు రూ.300ఉండగా, రెండు పేపర్లు రాయాలనుకునే అభ్యర్థులు రూ.400 చెల్లించేవారు. అయితే ఇప్పుడు మాత్రం కేవలం దరఖాస్తుకే వెయ్యి రూపాయలతో పాటు అదనంగా పేపర్‌కు మరో వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు ప్రతీ దరఖాస్తులో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు ఇవ్వాల్సిన రాయితీని సైతం ప్రకటించ లేదు. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు సాధారణ అభ్యర్థులతో పాటు ఎస్సీ, ఎస్టీ, వికలాంగ అభ్యర్థులు దరఖాస్తులు చేసేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. భారీగా పెంచిన ఫీజులను ప్రభుత్వం తగ్గించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఈ ఏడాది ఇన్‌సర్వీస్ టీచర్లకు అవకాశం

ప్రస్తుతం సర్వీస్‌లో ఉన్న టీచర్ల పదోన్నతులకు టెట్ అర్హత సాధించాలని నిబంధలను ప్రభుత్వం విధించడంతో వారికి టెట్ అర్హత తప్పనిసరిగా మారింది. దీంతో టెట్ నోటిఫికేషన్‌లో పనిచేస్తున్న పంతుళ్లకు ఈ సారి టెట్ రాసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలి..

బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన వారితో తమకు టెట్ రాయడం సాధ్యం కాదని పనిచేస్తున్న పంతుళ్లు చెబుతున్నారు. వారి కోసం ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బీఎడ్, డీఎడ్ విద్యార్థులు టెట్‌ను తేలికగా రాసే వీలుంటందని, పనిచేస్తున్న పంతుళ్లు వారితో పోటీగా పరీక్ష రాసేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందనే అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. కొన్నేళ్ల కిందట ఉపాధ్యాయ కోర్సులు పూర్తి చేసి ప్రస్తుతం ప్రభుత్వం బడుల్లో పనిచేస్తున్న పంతుళ్లు ఎలా రాస్తారనే వాదనను తెరపైకి తీసుకొస్తున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏదో ఒక సబ్జెక్టులో మాత్రమే నిష్ణాతులుగా ఉంటారని అయితే అన్ని సబ్జెక్టులతో కూడిన టెట్ రాయడం ఇప్పుడున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు కష్టతరంగా ఉంటుందనే అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు

ఫీజులో రాయితీని ఇవ్వాలి..

వల్లాల ముకుందం, హనుమకొండ, అభ్యర్థి



టెట్ దరఖాస్తు ఫీజులో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు రాయితీని ప్రకటించాలి. గత టెట్ పరీక్షకు ప్రభుత్వం ఫీజు రాయితీని ప్రకటించింది. ప్రభుత్వం టెట్ ఫీజుకు రాయితీని కల్పించి బలహీన వర్గాల విద్యార్థులు టెట్‌కు దరఖాస్తులు చేసుకునేలా చేయాలి.

ఫీజు తగ్గించాలి..

బి. మమత, టెట్ అభ్యర్థి, హనుమకొండ



టెట్ దరఖాస్తుకు ప్రభుత్వం భారీగా ఫీజులు పెంచింది. నిరుద్యోగులమైన మా దగ్గర వేలకు వేలు దరఖాస్తు ఫీజులు వసూల్ చేయడం సరికాదు. ఉద్యోగాలు రాకే ఇప్పటికే వయస్సు మించి పోతున్నది. ఇప్పుడు అధిక ఫీజులతో దరఖాస్తుకు దూరం చేయొద్దు.

మార్కుల కోసం రాసేవారికి గుదిబండ

చంద్రగిరి సునిల్‌కుమార్, తెలంణాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం



టెట్‌కు దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు టెట్ ఫీజుభారంగా మారింది. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సైతం ఎక్కువ మార్కుల కోసం మరోసారి టెట్ రాయాలనకునే అభ్యర్థులకు ఫీజు గుదిబండగా మారింది. ఎస్సీ, ఎస్టీ, వికాలంగులకు ఫీజులో రాయితి కల్పించాలని, ఫీజు తగ్గించాలి.

ఇన్‌సర్వీస్‌కు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

గుర్రపు రాజు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, హనుమకొండ



ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి. రెగ్యులర్ విద్యార్థులతో కలిసి టెట్ రాయడం ఉపాధ్యాయులకు కష్టతరంగా ఉంటుంది. ఎప్పుడో చదివిన ఉపాధ్యాయులు ఇప్పుడు పరీక్ష రాయడం ఇబ్బందిగానే ఉంటుంది. అన్ని సబ్జెక్టులతో కూడిన టెట్ రాయడం ఇప్పుడున్న ఉపాధ్యాయులకు కష్టంగానే ఉంటుంది.

ఎమ్మెల్యే నాయినిని కలిసిన ఐఆర్ఎస్ అధికారి అపూర్వ



కేయూ క్యాంపస్, మార్చి 26: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీ ప్రాంతానికి చెందిన మహారాష్ట్ర ఐఆర్ఎస్ అధికారి మంద అపూర్వ మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. కేయూ రిటైర్డు ఎకానమిక్స్ విభాగం ప్రొఫెసర్ మంద అశోక్‌కుమార్ కూతురు అపూర్వ ఐఆర్ఎస్ సాధించడంపై ఎమ్మెల్యేనాయిని రాజేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నాయిని కలిసిన వారిలో ప్రొఫెసర్ మంద అశోక్‌కుమార్, మంద అభినవ్‌లున్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాజీపేట, మార్చి 26: కాజీపేట రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంలో మంగళవారం ఉదయం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 55 నుంచి 60 యేళ్లు ఉంటాయని, తెలుపు రంగు, పొడవు ముఖం, తెల్ల గడ్డం, బ్లూ గీతల షర్ట్, వైట్ కలర్ లైనింగ్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆనవాళ్ల బట్టి చూస్తే మృతుడు లిఫ్ట్ పక్కనే పడుకుని నిద్రలోనే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి జేబులో కళ్యాణ్ జంక్షన్ నుంచి కాజీపేట అనే రైలు టిక్కెట్ ఉంది. గుర్తించడానికి ఇతరత్రా ఏ ఆధారాలు లేవు. ప్రయాణికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరచామన్నారు. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబరు 87126 58609, 99498 59108 కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఎస్.శ్రీనివాస్ (ఫైల్

కాజీపేట, మార్చి 26: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట విష్ణుపురికి చెందిన ఎస్.శ్రీనివాస్ (47) ఓ ప్రైవేట్ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 24న రహ్మత్‌నగర్‌లో రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. తీవ్రగాయాలపాలైన శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఎస్.పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రాజనీతిశాస్త్రంలో మాధవికి డాక్టరేట్



మాధవి

కేయూ క్యాంపస్, మార్చి 26: కాకతీయా యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పరిశోధకురాలు కె.మాధవికి డాక్టరేట్ ప్రకటించినట్లు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'స్టేట్ డెవలప్‌మెంట్ అండ్ డిస్లెస్‌మెంట్: ఏస్టడీ ఆఫ్ ఇరిగేషన్ ఇన్ తెలంగాణ స్టేట్' అనే అంశంపై కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ప్రొఫెసర్ జి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో మాధవి డాక్టరేట్ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన మాధవి హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా మాధవిని పలువురు అభినందించారు.

చరిత్రవిభాగంలో అనితకు..



ఈ. అనిత

కాకతీయ యూనివర్సిటీ చరిత్ర విభాగం పరిశోధకురాలు ఈదులకంటి అనితకు డాక్టరేట్ ప్రకటించినట్లు మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'ద రోల్ ఆఫ్ బద్దం ఎల్లారెడ్డి ఇన్ లెఫ్టిస్ట్ మూమెంట్స్ ఇన్ తెలంగాణ' అనే అంశంపై కేయూ చరిత్ర విభాగం ప్రొఫెసర్ పి.సదానందం పర్యవేక్షణలో అనిత డాక్టరేట్ పూర్తి చేశారు. డాక్టరేట్ పొందిన అనిత హనుమకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్రవిభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అనితను పలువురు అభినందించారు.

జేఎన్‌యూలో ప్రొఫెసర్ రామేశ్వరం ప్రసంగం

కేయూ క్యాంపస్, మార్చి 26: కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.రామేశ్వరంనకు అరుదైన అవకాశం లభించింది. 18-20 తేదీల్లో న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో 8వ ప్రపంచం కాన్సర్ కాంగ్రెస్ -2024 కాన్వకేషన్‌లో ప్రసంగించారు. నేచర్ క్యూర్ మెథడ్స్ ఇన్ ది మేనేజ్‌మెంట్ ఆఫ్ కాన్సర్- టూ సెంచరీస్ హిస్టోరికల్ ఎవిడెన్సెస్ ఆఫ్ ది వరల్డ్ అనే అంశంపై విస్తృత కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌ను కేయూ పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన ప్రసంగం విశేషాలను వీసీ రమేశ్‌తో పంచుకుని తనకిచ్చిన ప్రశంసాపత్రాన్ని ప్రదర్శించారు.



కేసీఆర్ బొకే ఇస్తున్న కావ్య

కేసీఆర్‌ను కలిసిన కడియం కావ్య

రాంనగర్, మార్చి 26: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కడియం కావ్య టీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కావ్య కలిసి తనపై నమ్మకంతో వరంగల్ బీఆర్ఎస్ టికెట్ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాలని కడియం కావ్యను ఈ సందర్భంగా కేసీఆర్ ఆశీర్వదించారు.

రావు పద్మను కలిసిన ఆరూరి రమేశ్



పద్మకు బొకే ఇస్తున్న అరూరి

హనుమకొండ టౌన్, మార్చి26: బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను మంగళవారం వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ హంటర్‌రోడ్‌లోని పద్మ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రావు పద్మ అమరేందర్‌రెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. పద్మ భర్త అమరేందర్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కొమ్మాలకు వచ్చిన బీజేపీ నాయకులు

భక్తజన సంద్రంగా కొమ్మాల జాతర

పోలీసుల హెచ్చరికలు బేఖాతరు ● హోరెత్తిన రాజకీయ ప్రభల జోరు ● గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్ ● ఇబ్బందులు పడిన కొమ్మాల జాతర భక్తులు ● లక్షమందికి పైగా దైవదర్శనం చేసుకున్న భక్తులు

గీసుగొండ/దుగ్గొండి, మార్చి 26: వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరకు రెండోరోజు మంగళవారం భక్తులు పోటెత్తారు. భక్తుల తాకిడితో భక్తజన సంద్రంగా మారింది. దాదాపు లక్షపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో శేష గిరి తెలిపారు. ప్రత్యేక దర్శన క్యూలైన్‌లో కూడా భక్తుల రద్దీ కనబడింది. వరంగల్ తదితర ప్రాంతాల నుంచి నుంచి ఎడ్ల బండ్లపై వచ్చిన భక్తులు రోడ్ల పక్కనే విడిది చేశారు. వరంగల్ నుంచి జాతర వరకు ఎండ్లబండ్ల ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కోడ్ ఉన్న నేపథ్యంలో డీసీపీ, ఏసీపీలు రాజకీయ ప్రభలపై విధించినా, రాజకీయ నాయకులు పట్టించుకోలేదు. ప్రభలకు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, సీఎం, ఎమ్మెల్యేల ఫొటో కటౌట్‌లు ఏర్పాటు చేసుకొని డీజేలతో ఆర్భాటంగా తరలివచ్చారు. ప్రభల తరలింపులో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ తలెత్తింది. పోలీసులు తక్షణమే స్పందించి ఇరుపక్షాలను శాంతింపచేశారు. నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, చెన్నారావుపేట, సంగెం మండలాలు నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ఎంసీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన రాజకీయ ప్రభలు పెద్ద సంఖ్యలో తరలివచ్చాయి. ప్రభలకు, జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి, సీఐ పవన్‌కుమార్, ఎస్‌ఐలు పర్యవేక్షించారు.

గిర్నిబావిలో ట్రాఫిక్ జామ్

రాజకీయ ప్రభబండ్ల భారీగా తరలిరావడంతో దుగ్గొండి మండలం గిర్నిబావి వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దీంతో సుమారు నాలుగు గంటల పాటు జాతరకొచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర సోమవారం ప్రారంభం కాగా.. మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, ఎంసీపీఐ(యూ) పార్టీలు పోటాపోటీగా ప్రభబండ్లను రూపొందించాయి. కాంగ్రెస్ ప్రభబండిని నర్సంపేట్ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బీఆర్ఎస్ ప్రభను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. వాటితో పాటు చెన్నారావుపేట, నర్సంపేట, నల్లబెల్లి, నెక్కొండ మండలాలకు చెంది న ప్రభబండ్లు కూడా గిర్నిబావి కేంద్రానికి చేరుకొని డప్పుచప్పుళ్లు, డీజే పాటలు, కోలాటం, ఆటపాటలతో ర్యాలీగా జాతరకు తరలాయి. ఈ క్రమంలో గిర్నిబావి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. అటు జాతరకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడగా.. బీఈడీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల వరకు నడిచి వెళ్లడం కనిపించింది. అలాగే వరంగల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులను నాచినపల్లి నుంచి లక్ష్మీపురం, మచ్చాపురానికి మళ్లించారు. డీసీపీ రవీందర్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు రాజగోపాల్, రమణమూర్తి, చంద్రమోహన్‌లతోపాటు సబ్ డివిజన్ ఎస్సైలు జక్కుల పరమేశ్, రఘుపతి, రామారావు, గాదె అరుణ్‌కుమార్‌లతో సీఆర్‌పీ పోలీసులు గిర్నిబావి రహదారికి చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.



జాతరకు వస్తున్న రాజకీయ ప్రభలు

ఎర్రగట్టు జాతరలో భక్తుల సందడి



దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న సంగారెడ్డి ఎస్పీ రూపేష్ దంపతులు

హసన్‌పర్తి, మార్చి 26: ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి జాతరలో రెండో రోజు మంగళవారం భక్తులు వెంకన్న స్వామిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారదాచార్యులు, ఆరుట్ల శ్రీనివాసచార్యులు ఉదయం స్వామివారికి పూజలు, పుష్పాభిషేకం నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం చిన్న చక్రముల బండ్లు తిరిగాయి. జాతరలో వెలిసిన దుకాణాల్లో భక్తుల సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహించారు. విశ్వక్సేన సేవా సమితి ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, వింజమూరి రమణ, పెద్దమ్మ సురేష్, జన్ను శైలజ, సంపత్ యాదవ్, విశ్వక్సేన సమితి సభ్యులు పాల్గొన్నారు.





డ్రెయినేజీల్లో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

డ్రెయినేజీలను శుభ్రం చేసిన బల్దియా సిబ్బంది

గిర్మాజీపేట, మార్చి 26 : వరంగల్ నగరంలోని 27వ డివిజన్ పరిధిలోని అబ్బనికుంట, యాకుత్‌పురా ప్రాంతాలలో డ్రెయినేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని మంగళవారం ప్రజారోగ్య సిబ్బంది శుభ్రం చేశారు. కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, ప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాశ్ అధికారుల దృష్టికి తీసుకోవడంతో వాటిని శుభ్రం చేశారు. అలాగే టీఆర్టీఈ, ఎస్ఆర్టీ కాలనీల నుంచి వచ్చే డ్రెయినేజీ కాలువలను రైల్వే ట్రాక్ పక్కనున్న పెద్ద డ్రెయినేజీ కాలువకు అనుసంధానం చేయాలని కార్పొరేటర్ అనిల్ కుమార్, కాంగ్రెస్ మీసాల ప్రకాశ్ అధికారులను కోరారు.

సమస్యల వలయంలో శ్మశాన వాటిక

• కొత్తవాడ హిందూ శ్మశానవాటికలో వసతులు కరువు • కనుమరుగైన అభివృద్ధి కమిటీ • పట్టించుకోని పాలకులు, అధికారులు

పోచమ్మమైదాన్, మార్చి 26: వరంగల్ ఆటోనగర్‌లోని హిందూ శ్మశాన వాటిక అధ్వానంగా తయారైంది. పట్టించుకునేవారు లేకపోవడంతో దహన సంస్కారాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు ఈ శ్మశాన వాటిక పచ్చని వాతావరణంతో ఆకట్టుకునేది. శివముక్తి ధామమా లేక ఉద్యాన వనమా అనే రీతిలో హరితవనం కనిపించేది. ప్రస్తుతం పట్టించుకునేవారు లేక అరకొర వసతులతో, ఎండిపోయిన మొక్కలతో అందవిహీనంగా మారింది. పాలకుల నిర్లక్ష్యం, అధికారులు పట్టింపులేని తనంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

● పట్టించుకోని పాలకులు

శ్మశాన వాటిక సుమారు 56 ఏళ్ల క్రితం ఏర్పాటైంది. కొత్తవాడ, ఆటోనగర్, తుమ్మలకుంట, రామనాథపురి, డాక్టర్స్ కాలనీ, మట్టెవాడలతోపాటు చుట్టు ప్రక్కల అన్ని ప్రాంతాల వారు అంత్యక్రియలు ఇక్కడే నిర్వహిస్తారు. ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్మశాన వాటికలో కనీసం నీటి వసతి కూడా కానరావడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. స్మృతివనం పేరుతో ప్రహరీ తొలగించడంతో పశువులు, కుక్కలు శ్మశానవాటికలో విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి.



చెత్త, చెదారంతో అధ్వానంగా కనిపిస్తున్న శ్మశాన వాటిక పరిసరాలు

● వీధి కుక్కల హల్‌చల్..

శ్మశానవాటికలో వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ఇక్కడకు వచ్చే వారిపై దాడి చేస్తుండడంతో వారు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో కర్మకాండలు చేసుకుందుకు వచ్చేవారు కుక్కల్ని చూసి జంకుతున్నారు. ఇటీవల కాలంలో అనేకమంది కుక్క కాటుకు గురయ్యారని స్థానికులు పేర్కొంటున్నారు.

● అభివృద్ధి కమిటీ కనుమరుగు ...



కొత్తవాడ ఆటోనగర్‌లోని హిందూ శ్మశానవాటిక

ఆటోనగర్‌లోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ కనుమరుగైంది. సుమారు ఆరు సంవత్సరాలుగా శ్మశానవాటికను పట్టించుకునే వారు లేకుండా పోయారు. స్థానిక నాయకుల ఆధిపత్య పోరుతో అభివృద్ధిని అడ్డుకుని నిర్వీర్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో అభివృద్ధి కమిటీ నేతృత్వంలో సుమారు కోటి రూపాయలతో అభివృద్ధి పనులు నిర్వహించారు. అనేక సదుపాయాలు కల్పించి ప్రజలకు సకల సౌకర్యాలు అందించారు. కానీ ప్రస్తుతం అభివృద్ధి కమిటీ కనుమరుగవడంతో శ్మశానవాటిక నిర్వీర్యమైపోతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

సంగెం, మార్చి 26: పరకాల నియోజకవర్గంలోని పలువురు బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. హనుమకొండలోని పరకాల ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం సంగెం మండలానికి చెందిన నాయకులకు పార్టీ కండువా కప్పి రేవూరి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో సంగెం ఎంపీపీ కందకట్ల కళావతి, మండల రైతుబంధు మాజీ అధ్యక్షుడు కందకట్ల నరహరి, సంగెం ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, నల్లబెల్లి ఎంపీటీసీ కట్ల సుమలత, మాజీ సర్పంచులు, మాజీ వైస్ ఎంపీపీలు గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ విధానాన్ని అవలంబించాలి

వరంగల్ వ్యవసాయం, మార్చి 26: రైతులు ఆధునిక వ్యవసాయ సాగు విధానాలను అవలంబించాలని రాజేంద్రనగర్ అఖిల భారత సమగ్ర వ్యవసాయ పద్ధతుల పరిశోధన విభాగం హెడ్ డాక్టర్ ఎస్.గోవర్ధన్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన రైతు వేదికల్లో రైతు నేస్తం(వీడియో కాన్ఫరెన్స్) కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంతగా మంగళవారం పలివేల్పులలో హనుమకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు కార్యక్రమంలో డాక్టర్ ఎస్. గోవర్ధన్, డాక్టర్.ఎస్.రామగోపాల వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయలేని వారిని గుర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

సంగెం, మార్చి26: వృద్ధ్యాప్యం, అంగవైకల్యం, దీర్ఘకాలిక అనారోగ్యం కారణాలతో ఓటు వేయలేని స్థితిలో ఉన్న ఓటర్లను బీఎల్‌వోలు గుర్తించాలని తహసీల్దార్ రాజ్ కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సెక్టోరల్ అధికారులు, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించుటకు బీఎల్‌వోలు సంసిద్ధంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, సెక్టోరల్ అధికారి రమేష్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు యాకయ్య, సాయిరాజ్, రోహిణీ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వాహణకు పకడ్బందీ ఏర్పాట్లు

నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నోడల్ అధికారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తాజాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26: కొద్ది రోజుల్లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం 106- వరంగల్ (తూర్పు) నియోజకవర్గం పరిధిలోని నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసి కమిషనర్ సిబ్బంది ఎన్నికల విధి విధానాలు పాటించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేస్తూ ఎఫ్ఎస్‌టీఎస్ఎస్, వీఎస్‌టీలకు అందే ఫిర్యాదులను స్వీకరిస్తూ పరిష్కారం చూపాలన్నారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌ల గుర్తింపు ప్రధానమన్నారు. పోలింగ్ అధికారులు వారికి నిర్వహించే శిక్షణా తరగతులకు తప్పకుండా హాజరు కావాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి సెక్టోరియల్ అధికారులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. 80 యేళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, అందుకు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 3,909 పోస్టల్ బ్యాలెట్‌లు పంపిణీ చేయాల్సి ఉండగా, 1,762 పంపిణీ చేశామన్నారు. సి విజిల్, సువిధ యాప్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 230 పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల కోసం త్రిచక్ర వాహనాలు అందుబాటులో ఉంచాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీపీవో అజీత్‌రెడ్డి, సెక్రెటరి విజయలక్ష్మి, డిప్యూటి కమిషనర్ కృష్ణారెడ్డి, ఏసీపీ బానుతు నాందిరాం నాయక్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, టీపీఆర్‌వో రాజేశ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో జాతీయ ట్రిబునల్ బెంచ్‌ప్రిన్సిపల్ పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న నరేష్ సలేచ

వరంగల్ కల్చరల్, మార్చి 26: చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని జాతీయ లా ట్రిబునల్ బెంచ్ ప్రిన్సిపాల్ నరేష్ సలేచ అమ్మవారిని మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ ప్రొటోకాల్ కలిగిన నరేష్ సలేచ వరంగల్‌కు వచ్చిన నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు నరేష్ సలేచ దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మకు పద్మశాలీల మొక్కులు



బోనాలతో బయలు దేరిన పద్మశాలీ మహిళలు

సంగెం, మార్చి 26: రేణుకా ఎల్లమ్మ తల్లికి మంగళవారం పద్మశాలీలు మొక్కులు సమర్పించుకున్నారు. బొల్లికుంట గ్రామ పద్మశాలీ కులస్థులు అనవాయితీగా ప్రతీ సంవత్సరం మామునూరులోని ఎల్లమ్మ దేవాలయంలో మొక్కులు సమర్పించుకుంటారు. మహిళలు ఇంటి నుంచి బోనాలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తులు కేరింతలు పెడుతూ తాండవం చేస్తారు. దేవాలయంలో పట్నాలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో బొల్లికుం పద్మశాలి సంఘం నాయకులు మార్గం ఎల్లయ్య, మార్గం రాంచందర్, దేవులపల్లి సారంగం, మార్గం మహేష్, కమటం ప్రభాకర్, కుమారస్వామి, ఎన్నం నాగభూషణం, సమ్మయ్య, మార్గం సుదర్శన్, లడ్డగట్టు రమేష్, ఎద్ద ఎల్లయ్య, చిన్న ఎల్లయ్య, నగేష్, రంజిత్ పాల్గొన్నారు.

బొడ్రాయికి మండల పూజలు



కార్పొరేటర్ చందన పూర్ణచందర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కరీమాబాద్, మార్చి 26: రంగశాయిపేటలో రెండు చోట్ల ప్రతిష్ఠాపన చేసిన గ్రామదేవత బొడ్రాయిలకు మంగళవారం మండల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. 41 రోజులు పూర్తయినందున నెహ్రూసెంటర్‌లోని బొడ్రాయి, రామాలయం వద్ద గల బొడ్రాయి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వెలిదె నరసింహమూర్తి, ప్రభాకర్ శర్మ, భార్గవ శర్మ, ప్రదీప్‌శాస్త్రి, శ్రీధరాచార్యులు, మణికంఠ, శంకర శాస్త్రి ప్రత్యేక పూజా క్రతువులు నిర్వహించి గ్రామదేవతలను పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, కొల్లూరి యోగానంద్, కేదల పద్మజనార్ధన్, ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించిన ఆర్‌వైఎఫ్ కమిటీ సభ్యులను, కార్పొరేటర్ చందన పూర్ణచందర్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయుడు మునుకుంట్ల రాములు సభ్యులను సన్మానించారు. సేవలు చేసి ఊరిని కాపాడుకున్నారని కొనియాడారు.

శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో శివానంద లహరి పారాయణం చేస్తున్న మహిళాభక్తులు

వరంగల్ సిటీ, మార్చి 26: కాశిబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓరుగల్లు సౌందర్య లహరి భక్తమండలి బృందం ప్రతినిధులు శోభారాణి, జయశ్రీల ఆధ్వర్యంలో సౌందర్య లహరి స్తోత్రం, శివానంద లహరి పారాయణం నిర్వహించారు. దీపారాధన చేసి 50 మంది మహిళలు స్తోత్రాలను శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు గుండేటి నరేంద్రకుమార్, ఉపాధ్యక్షుడు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి గోనె జగదీశ్వర్, ఓరుగంటి కొంరయ్య, బోడకుంట్ల వైకుంఠం, బొమ్మగానికి క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

దేవుడి భూములను అమ్మే హక్కు ఎవరిచ్చారు

పీఏబీసీ అదనపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురేందర్‌బాబు

కరీమాబాద్, మార్చి 26 : హనుమకొండలోని మిషన్ ఆస్పత్రికి సంబంధించిన ఆస్తులకు లోన్‌లు ఇచ్చి అమ్మే హక్కులు బ్యాంకులకు ఎవరు ఇచ్చారని బాపిస్టు చర్చిల ఆస్తుల రక్షణ సంఘం (పీఏబీసీ) అదనపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రాపర్టీ కస్టోడియన్ మంద సురేందర్‌బాబు ప్రశ్నించారు. మంగళవారం ఉర్సు సంఘ భవనంలో విలేకరుల సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బాపిస్టు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సురేందర్ బాబు మాట్లాడారు. మిషన్ ఆస్పత్రికి సంబంధించిన భూముల కబ్జాదారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. 2004 నుంచి మద్రాసు, ఏపీ హై కోర్టుల్లో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను అమలు చేయటంలో ఇప్పటి వరకు జిల్లా అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. 2004లోనే కబ్జాదారులు కోర్టుకు అండర్ టేకింగ్ చేశారన్నారు. కానీ కొంత మంది కబ్జాదారులు పన్నాగం పన్ని హనుమకొండలోని ఓ సర్వే నెంబర్‌లోని చర్చి భూమిలో అక్రమంగా వ్యాపార సముదాయం నిర్మించారని రోపించారు. ఓ బ్యాంకు మేనేజర్ లోన్‌ను ఎలా ఇచ్చారో తెలపాలన్నారు. పతకం ప్రకారమే లోన్ తీసుకొని ఎగ్గొట్టేలా పన్నాగం పన్నారని ఆరోపించారు. సదరు ఆక్రమణ దారుడు లోన్ చెల్లించకపోవటంతో ఇటీవల ఈ భవనాన్ని వేలం ద్వారా వేలం ద్వారా అమ్మేందుకు సదరు బ్యాంకు నోటీసులు జారీ చేసిందన్నారు. ఎవరి ఆస్తికి ఎవరు లోన్ ఇచ్చారో అమ్మేందుకు బ్యాంకుకు ఉన్న అధికారాలు ఏమిటో న్యాయస్థానాల ద్వారా తెలపాలన్నారు. ఈ వ్యవహారంపై సీపీ, కలెక్టర్‌లకు నివేదికలు అందిస్తామన్నారు.

ఆస్తి పన్ను చెల్లించిన ఆర్టీసీ అధికారులు



డీసీపీకి చెక్కును అందిస్తున్న ఆర్టీసీ అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 26: నగర పాలక సంస్థకు బకాయి ఉన్న ఆర్టీసీ హనుమకొండ-1 డిపోకు చెందిన ఆస్తిపన్నును మంగళవారం బల్దియా అధికారులకు ఆర్టీసీ అధికారులు చెల్లించారు. బల్దియా డిప్యూటీ కమిషనర్ రవీందర్‌ను ఆర్టీసీ కార్యాలయానికి పిలిచి రూ.27.81 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడారు. గృహ యజమాన్యాలు, ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలు ఆస్తి పన్నును ఈ నెల 31 వరకు 90 వడ్డీపై రాయితీ ఇస్తుందన్నారు. ఈ అవకాశం ఐదు రోజులు మాత్రమే ఉందని, అందరు ప్రతీఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మోహన్‌రావు, రెవెన్యూ అధికారి యుసుఫోద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కాంపు కార్యాలయం ప్రారంభోత్సవం

వరంగల్‌సిటీ, మార్చి 26: నగరంలోని 19వ డివిజన్ ఓసిటీలో వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని బుధవారం ఉదయం 8 గంటలకు ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే అటవీ, దేవాదాయ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు ప్రారంభోత్సవం చేయనున్నారు.

ఈ కార్యక్రమానికి నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ నాయకులు హాజరుకావాలని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు.

ఘనంగా కొండా సుస్మిత జన్మదిన వేడుకలు

గిర్మాజీపేట, మార్చి 26 : రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుల కూతురు, యువజన కాంగ్రెస్ నాయకురాలు కొండా సుస్మిత పటేల్ జన్మదిన వేడుకల మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కూలర్లు, రోగులకు పండ్లు,బ్రెడ్ పంపి ణీ చేశారు. గోపాల నవీన్‌రాజు ఆధ్వర్యంలో నాలుగు జంబో కూలర్లను సూపరింటెండెంట్ నిర్మలాకుమారికి అందచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతాకుల అనిల్ కుమార్, గుండేటి నరేందర్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, ప్రదేశ్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు గోపాలరావు, మబ్బు ప్రవీణ్ పాల్గొన్నారు.

● వరంగల్ సిటీ: కాశిబుగ్గ జంక్షన్‌లో కొండా సుస్మితాపటేల్ జన్మదిన వేడుకలు 19వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి రాజేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్గొండ రమేష్, కూచన రవీందర్, సిలువేరు శ్రీనివాస్, సందీప్, పుష్ప, నారగోని స్వప్న, జంగం ప్రభాకర్ పాల్గొన్నారు. సొసైటీకాలనీ మదర్ థెరిసా అనాథాశ్రమంలో కొరవి పరమేష్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.



సీకేఎం ఆస్పత్రిలో కూలర్లు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

● పోచమ్మమైదాన్: పోచమ్మమైదాన్ చౌరస్తాలో సుస్మిత జన్మదినం సందర్భంగా తూర్పు యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కమల్ ఆధ్వర్యంలో జిల్లా యూత్ అధ్యక్షుడు రేపల్లె శ్రీరంగనాథ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తోట పవన్, లోకేష్, రోషన్, సంజయ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న ఆటోడ్రైవర్



ఆటోలో మరిచిపోయిన బ్యాంగ్‌ను తెచ్చి ఇచ్చిన ఆటో డ్రైవర్

వరంగల్ చౌరస్తా, మార్చి 26: నర్సంపేటకు చెందిన ఎన్. యాదమ్మ ఆటోలో ప్రయాణించి వరంగల్ చౌరస్తాలో దిగింది. ఆటో దిగే క్రమంలో తమ బ్యాగ్‌లో గుర్తింపు కార్డులు, నగదు రూ. 4,700 ఆటోలోనే మర్చిపోయింది. బ్యాగ్ పోయిందన్న బాధలో ఉండగా రాజు అనే ఆటో డ్రైవర్ యాదమ్మ బ్యాగ్‌లో ఉన్న గుర్తింపు కార్డులు, ఫోన్ నంబర్ చూసి ఫోన్ చేసి వరంగల్ చౌరస్తాకు తిరిగి వచ్చి బ్యాగ్‌ను ఆమెకు అందించారు. నిజాయితీగా తిరిగి బ్యాగ్ తెచ్చి ఇచ్చిన ఆటో డ్రైవర్ రాజును యాదమ్మ అభినందించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య గొడవ



జాతరలో గొడువకు దిగిన రాజకీయ నాయకులు

చెన్నారావుపేట, మార్చి 26: మండలంలోని కోనాపురంలో లక్ష్మీ నర్సింహ స్వామి జాతరలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రభబండ్ల విషయంలో గొడువకు దారితీసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కాల్‌నాయక్‌తండాకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు జాతరకు ప్రభబండ్లను కట్టుకొని వస్తున్నారు. కోనాపురంనకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభబండ్లను కట్టుకొని వస్తున్న క్రమంలో ప్రధాన సెంటర్‌కు రాగానే రెండు ప్రభబండ్లు ఎదురెదురుగా వచ్చాయి. తమ ప్రభబండ్లు ముందుగా వెళ్లాలంటే, తమ ప్రభబండ్లు ముందుగా వెళ్లాలని ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. దీంతో అక్కడ ఉన్న ఇరు పార్టీల నాయకులు కాసేపు తోపులాడుకున్నారు. కొమ్మాల జాతరలో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్లేబస్సులు, వాహనాలు గంట పాటు నిలిచిపోయాయి. అనంతరం ఇరు పార్టీల నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోగానే వివాదం సర్దుమణిగింది.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 27 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

'అనర్హులకిచ్చిన 'కల్యాణలక్ష్మి'ని రికవరీ చేయాలి'

ఖానాపురం, మార్చి 26 : అనర్హులకు అందించిన కల్యాణలక్ష్మి ఆర్థిక సహాయాన్ని రికవరీ చేయాలని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పరుచూరి రత్నాకర్‌రావు మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పదెకరాల వ్యవసాయ భూమి ఉందని, వారు కల్యాణలక్ష్మి పథకానికి అనర్హులని, అయినా సదరు రైతు కూతురు పేరిట అధికారులు కల్యాణలక్ష్మి చెక్కును జారీ చేశారని ఆరోపించారు. ఇలా చాలామంది అనర్హులకు కల్యాణలక్ష్మి మంజూరైందని, అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని, అనర్హులకు ఇచ్చిన పథకం సొమ్మును రికవరీ చేయాలని ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఆర్డీవో కార్యాలయం నుంచి ఫిర్యాదు రాగానే విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని సమాధానమిచ్చారు.

కోనాపురంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య గొడవ



కోనాపురంలో జాతరలో గొడువకు దిగిన రాజకీయ నాయకులు

చెన్నారావుపేట, మార్చి 26: మండలంలోని కోనాపురం గ్రామంలో లక్ష్మీ నర్సింహస్వామి జాతరలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రభబండ్ల విషయంలో గొడవకు దారితీసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. కాల్‌నాయక్‌తండాకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు జాతరకు ప్రభబండ్లను కట్టుకొని వస్తున్నారు. కోనాపురంనకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభబండ్లను కట్టుకొని వస్తున్న క్రమంలో ప్రధాన సెంటర్‌కు రాగానే రెండు ప్రభబండ్లు ఎదురెదురుగా వచ్చాయి. తమ ప్రభబండ్లు ముందుగా వెళ్లాలంటే, తమ ప్రభబండ్లు ముందుగా వెళ్లాలని ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. దీంతో అక్కడ ఉన్న ఇరు పార్టీల నాయకులు కాసేపు తోపులాడుకున్నారు. కొమ్మాల జాతరలో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్లేబస్సులు, వాహనాలు గంట పాటు నిలిచిపోయాయి. అనంతరం ఇరు పార్టీల నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోగానే వివాదం సర్దుమణిగింది.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

దుగ్గొండి, మార్చి 26 : మండలంలోని కేశవపురం గ్రామ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో 18వ బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వ హించారు. పట్టు వస్త్రాలు ఆలయ ధర్మకర్త కంది జితేందర్‌రెడ్డి -సరళ దంపతులు సమర్పించారు. కల్యాణమహోత్సవానికి ఆయల చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పూలమ్మ దంపతులలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

జీవైఎస్ మండల అధ్యక్షుడిగా కుమార స్వామి



నెక్కొండ, మార్చి 26 : గ్రామీణ వైద్యుల సంఘం (జీవైఎస్) నెక్కొండ మండల అధ్యక్షుడిగా కుడికాల కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి కొంకాల సాంబయ్య సోమవారం తెలిపారు. నెక్కొండలోని సుమంగళి పంక్షన్ హాల్‌లో ఈ ఎన్నికలను నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా కొండపల్లి హరి, బానోతు రవి, ప్రధాన కార్యదర్శిగా మాంకాల ఐలయ్య ససహ కార్యదర్శిగా సుంకరి వాసుదేవ్, కోశాధికారిగా బక్కి శంకర్, ముఖ్య సలహాదారులుగా కుడికాల సాంబయ్య, రాచమల్లు వెంకటేశ్వర్లు, బండారు ధనుంజయ్య, కార్యవర్గ సభ్యులుగా శ్యాంసుందర్, సతీష్, మధర్, వెంకన్న, ఉమేశ్, శ్రావణ్, రాజు, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ప్రభబండ్లను టెంకాయకొట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, ఎంపి అభ్యర్థి బలరాంనాయక్



ప్రభబండ్లను కార్యకర్తల మధ్య ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ప్రభబండ్లను ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

రాజకీయ జాతరగా 'కొమ్మాల'

నర్సంపేట, మార్చి 26 : వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర రాజకీయ జాతరగా పేరొందింది. పేరుకే జాతర అయినప్పటికీ ఈ జాతరపై రాజకీయ ప్రభావం కనిపిస్తుంది. గత అయిదు దశాబ్దాల క్రితం నుంచే ఈ జాతర రాజకీయ జాతరగా పిలువబడుతోంది. దివంగత మాజీ ఎమ్మెల్యే ఓంకార్ హయాంలో నాటి సీపీఎం, ఎంసిపీఐ(యూ) ఆధ్వర్యంలో నర్సంపేట నియోజకవర్గంలోని మండలాల నుంచి ఎరుపురంగు కాగితాలతో తయారుచేసిన ప్రభబండ్లను పార్టీ నాయకులు జాతరకు తరలించే వారు. వీరి ప్రభబండ్లకు పోటీగా కాంగ్రెస్ పార్టీ నాయకులు జాతరకు మూడు రంగులతో తయారు చేసిన ప్రభబండ్లను తరలించే వారు. నాడు ఉద్రిక్త పరిస్థితుల మధ్య ప్రభబండ్లు జాతరకు తరలివెళ్ళేవి, జాతర సమయంలో రాజకీయ పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటుండడంతో కొన్నాళ్ళ పాటు జాతరకు ప్రభబండ్లు తరలకుండా పోలీసులు చర్యలు తీసుకునేవారు.

కొన్నేళ్ల పాటు ప్రభబండ్ల ప్రాభవం కొంతమేరకు తగ్గింది. మళ్ళీ ప్రస్తుతం జరుగుతున్న జాతరపై రాజకీయ ప్రభావం చూపుతుంది. ఈ జాతర సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరుగకుండా చూడడానికి పోలీసులకు సవాల్‌గా మారింది.

జాతరకు తరలిన కాంగ్రెస్ ప్రభ బండ్లు

నర్సంపేట నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు తయారు చేసిన ప్రభ బండ్లను జాతరకు తరలి వెళ్ళే కార్యక్రమాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి బలరాం నాయక్‌లు ప్రారంభించారు. డప్పుచప్పుళ్ళ మధ్య ప్రభ బండ్లతో జాతరకు పెద్ద సంఖ్యలో వివిధ మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివస్తున్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ...

నర్సంపేట నియోజకవర్గంలోని దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట తదితర మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు తయారు చేయించిన ప్రభబండ్లు జాతరకు తరలివెళ్ళే కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. నర్సంపేట నుంచి దుగ్గొండి మండలం గిర్నిబావి మీదుగా కొమ్మాల జాతరకు ప్రభబండ్లు తరలివెళుతున్నాయి, ఒక పార్టీకి దీటుగా మరో పార్టీ ప్రభబండ్లను తరలిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఈ ఏడాది రాజకీయ ప్రభబండ్ల తరలింపు ఎక్కువగా కనిపిస్తుంది.

బీజేపీ ఆధ్వర్యంలో...

గీసుగొండ మండలం కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతరకు ఈ ఏడాది బీజేపీ నియోజకవర్గ చేరిక కమిటీ చైర్మెన్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో తయారు చేయించిన ప్రభబండ్లను జాతరకు తరలించే కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మంగళవారం నర్సంపేటలో ప్రారంభించారు.డప్పుచప్పుళ్ల మధ్య నర్సంపేట నుంచి కొమ్మాల జాతరకు ప్రభబండ్లు తరలివెళ్ళాయి. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, పార్లమెంట్ కో కన్వీనర్ కట్ల రాంచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగించిన పోలీసులు

నెక్కొండ, మార్చి 26 : నెక్కొండ పోలీసు స్టేషన్ పరిధిలోని అలంకానిపేట గ్రామానికి చెందిన గుంటుక రమేశ్‌కు సోమవారం పోలీసులు పోయిన అతని సెల్‌ఫోన్ అప్పగించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. 2022 డిసెంబరు 23న రమేశ్ వరంగల్ నుంచి నెక్కొండకు వస్తుండగా సెల్‌ఫోన్ పోయింది.ఈ విషయాన్ని బాధితుడు వెంటనే ఆన్‌లైన్‌లో సీఐఈఆర్ మొబైల్ యాప్ మిస్సింగ్ పోర్టులో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ పోర్టు నుంచి ఫోన్ ట్రాప్‌చేసి రికవరీచేసి రమేశ్‌కు అప్పగించారని ఎస్సై వివరించారు.

అయ్యప్ప ఆలయంలో వార్షికోత్సవం



ఆలయంలో కేకును కట్‌చేస్తున్న కమిటీ సభ్యులు

నర్సంపేటటౌన్, మార్చి 26 : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప దేవాలయంలో 25వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆలయ ట్రస్టు చైర్మెన్ శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఆలయం నిర్మించి 25 ఏళ్ళు అవు తున్న సందర్భంగా స్వామివారి పుట్టిరోజు వేడుకగా కేక్‌ను మాధవశంకర్, బూపతి లక్ష్మీనారాయణ, మాదారపు చంద్ర శేఖరం కట్‌చేసి కమిటీ సభ్యులకు, భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, దోమకుంట్ల సదానందం, వంగేటి గోవర్ధన్, చింతల కమలాకర్‌రెడ్డి, ఆకుల ప్రభాకర్, దొడ్డా వేణు, మల్యాల రాజు, ఆలయ అర్చకులు, గురుస్వాములు పాల్గొన్నారు.

అసైన్డ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



తహసిల్ ఉద్యోగికి వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట, మార్చి 26 : పట్టణంలోని కాకతీయనగర్ శివారులో సర్వే నంబర్ 601/2 అసైన్డ్ చేసిన భూమిని పీవోటి చట్టం ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిరహించారు. డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అసైన్డ్ భూమిని రియల్ ఎస్టేట్ కోసం వినియోగిస్తున్న అసైన్డ్‌దారుడి నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ భూములను అధికారులు పరిరక్షించే చర్యలు తీసుకోవడం లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ముఠాలు రెవెన్యూ కార్యాలయాన్ని అడ్డాగా చేసుకొని కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధంగానే ప్రస్తుత పభుత్వంలో కూడా కబ్జాదారులు అదే పద్ధతిని కొనసాగిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గడ్డమీది బాలకృష్ణ, కందికొండ రాజు, అనిల్, ఎండి.ఫరీదా, వర్తంతి విజయ, స్వప్న, ఉదయగిరి, నాగమణి, లక్ష్మి, యాకలక్ష్మి, కొండి మల్లయ్య, నాగరాజు, వెంకన్న, తోటకూరి రజిత పాల్గొన్నారు.

గీత వృత్తి రక్షణకు గౌడలు ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

నర్సంపేట, మార్చి 26 : గీత వృత్తి రక్షణకు గౌడ కులస్తులు ఏకం కావాలని మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ పిలుపు నిచ్చారు. పట్టణంలో మోకు దెబ్బ జిల్లా కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పాలకులు ఓట్ల కోసం ఎక్స్‌గ్రేషియా, ప్రమాద జీవిత బీమా, సేఫ్టీ మోకులు, మోపెడ్లు అందిస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. డెక్కాడితే గాని డొక్కాడని గీత కార్మికుల తల రాత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలకు ప్రమాదకరమని తెలిసినా కుటుంబ పోషణ కోసం కుల వృత్తిని గీత కార్మికులు నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. పాలకుల స్వార్థం కోసం గ్రామ గ్రామాన, వీధివీధిలో బెల్టుషాపులను ప్రోత్సహించడంతో గీత కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల కతీతంగా గౌడ కులస్తులు ఏకమైతేనే పాలకులు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి దిగివస్తారని ఆయన అన్నారు. గీత కార్పొరేషన్‌కు చైర్మెన్‌ను నియమించి రూ.5కోట్లు కార్పొరేషన్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిశాల సదానందం, గంప రాజేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు జూలూరి హరిప్రసాద్, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాంపెల్లి వెంకట్, గంప రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగిన కోనాపురం లక్ష్మీనర్సింహస్వామి జాతర



మొక్కులు చెల్లించుకుంటున్న తహసీల్దార్ ఫణికుమార్

చెన్నారావుపేట, మార్చి 26 : మండలంలోని కోనాపురం శ్రీలక్ష్మీ నర్సింహస్వామి జాతర హోలీ పండుగను పురస్కరించుకొని రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. స్థానిక తహసీల్దార్ ఫణికుమార్, ఎస్సై గూడ అరుణ్ కుమార్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. కోనాపురంలో రాత్రంతా ప్రభబండ్ల ప్రదర్శన కొనసాగింది. వివిధ పార్టీలకు చెందిన వారు తమ ప్రభబండ్లతో వచ్చారు.

మండల కేంద్రం నుంచి కొమ్మాలకు కాంగ్రెస్ పార్టీతో పాటు వివిధ పార్టీల వారు వేరువేరుగా ప్రభ బండ్లతో తరలివెళ్లారు.మండలంలోని అక్కల్‌చెడ, ఈర్యతండా, లింగాపురం, గొల్లపల్లె, ఖాదర్‌పేట నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఖాదర్‌పేట, ఈర్యతండా నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభబండ్లతో కొమ్మాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఎడ్ల నారాయణరెడ్డి, ఎంపీటీసీ గుండాల మహేందర్, ప్రణీత్‌కుమార్‌గౌడ్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దెన రమేష్, తప్పెట రమేష్, లక్క రాజు, మాజీ ఎంపీటీసీ ఈర్యానాయక్, మెంతుల రమేష్, జోరు వీరయ్యగౌడ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

దుగ్గొండి, మార్చి 26 : ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళా మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎఎస్సై విజయ్ కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన పర్లపల్లి విజయ (45) కూలీ పనులు చేసుకొని జీవనం గడుపుతుంది. సోమవారం హోలీ ఉత్సవాలలో పాల్గొంది. స్నానం కోసం గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువులోకిపోయి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. సోమవారం రాత్రి వరకు ఇంటికి రాక పోవగంతో కుటుంబ సభ్యులు విజయ ఆచూకీ కోసం వెతికినా గ్రామంలో ఎక్కడ కనబడలేదు. మంగళవారం చెరువులో శవంగా తేలింది. మృతురాలి కుమారుడు పర్లపల్లి ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్సై వెల్లడించారు.

వ్యవసాయ పనిముట్లు చోరీ

నల్లబెల్లి, మార్చి 26 : మండలంలోని రంగాపురంలో వ్యవసాయ పని ముట్లు చోరీకి గురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధిత రైతు భట్టు సాంబయ్య తెలిపిన కథనం ప్రకారం... రంగాపురం గ్రామానికి చెందిన భట్టు సాంబయ్య రోజు వారి పనుల రీత్యా యాథావిధిగా తన వ్యవసాయ బావి వద్దకు మంగళవారం ఉదయం వెళ్లాడు. వ్యవసాయ బావి వద్ద ఉండే స్టాటర్, ప్లగులు, కరెంట్ వైరు, డ్రిప్పు పైపులు తదితర పనిముట్లు కనిపించలేదు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించాలరని గుర్తించాడు. వీటి విలువ రూ.20 వేలకు పైగా ఉంటుందని, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తమకు న్యాయం చేయాలని ఎస్సైను కోరాడు. తక్షణమే స్పందించిన ఎస్సై రామారావు ఫిర్యాదు పరిశీలించి, చట్ట పరమైన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని బాధితుడు తెలిపారు.

కంఠమహేశ్వరస్వామి విగ్రహాల ఉరేగింపు

చెన్నారావుపేట, మార్చి 26 : మండలంలోని పాపయ్యపేటలో గౌడ కులస్తుల ఆరాధ్యదైవమైన కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనల్లో భాగంగా మంగళవారం గ్రామంలో వీధివీధినా కంఠమహేశ్వర స్వామి విగ్రహాల ఉరేగింపును గౌడ కులస్తులు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి స్వామి, బుర్ర సుదర్శన్‌గౌడ్, బండి రమేష్‌గౌడ్, పలువురు గౌడ పెద్దలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వర్ధన్నపేట రూరల్, మార్చి 26 : మండలంలోని నల్లబెల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బిర్రు ఉప్పలయ్య కుటుంబాన్ని మంగళవారం వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబసభ్యులైన పంతిని మాజీ ఎంపీటీసీ ముంజ చేరాలు, నందనం సొసైటీ డైరెక్టర్ పద్మ కుమారస్వామిలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు తక్కలపెల్లి చందర్‌రావు, సీసీ గోలి కొమురయ్య, ముత్యం దేవేంద్ర సంపత్, జ్యోతి మాధవరావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న ఆటోడ్రైవర్

వరంగల్ చౌరస్తా, మార్చి 26 : నర్సంపేటకు చెందిన ఎస్. యాదమ్మ ఆటోలో ప్రయాణించి వరంగల్ చౌరస్తాలో దిగింది. ఆటో దిగే క్రమంలో తమ బ్యాగ్‌లో గుర్తింపు కార్డులు, నగదు రూ. 4,700 ఆటోలోనే మర్చిపోయింది. బ్యాగ్ పోయిందన్న బాధలో ఉండగా రాజు అనే ఆటో డ్రైవర్ యాదమ్మ బ్యాగ్‌లో ఉన్న గుర్తింపు కార్డులు, ఫోన్ నంబర్ చూసి ఫోన్ చేసి వరంగల్ చౌరస్తాకు తిరిగి వచ్చి బ్యాగ్‌ను ఆమెకు అందించారు. నిజాయితీగా తిరిగి బ్యాగ్ తెచ్చి ఇచ్చిన ఆటో డ్రైవర్ రాజును యాదమ్మ అభినందించారు.

దొంగలు బాబోయ్ దొంగలు

వ్యవసాయ బావుల వద్ద, ఇండ్లలో చోరీలు

బెంబేత్తుతున్న ప్రజలు

పోలీసులే కట్టడి చేయాలని కోరుతున్న గ్రామస్థులు



రంగాపురంలో పైపులను ఎత్తుకెళ్లిన స్థలిని చూపెడుతున్న రైతు భట్టు సాంబయ్య



శనిగరం శివారులోని చోరీ జరిగిన ఓ ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

నల్లబెల్లి, మార్చి 26 : మండల వ్యాప్తంగా రోజురోజుకీ చోరీలు మితిమీరు తున్నాయి. వ్యవసాయ బావులవద్ద ఉండే కరెంట్ మోటార్లు, పైపులు, వైర్లు, పరదాలు, కొన్ని చోట్ల మిర్చినారు, ఇండ్లలో బంగారం, డబ్బులు చోరీ అయ్యాయి. కొన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలు కూడా చోరీకి గురయ్యాయి. పోలీస్ శాఖ ఈ చోరీలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిఘా నేత్రాల వైఫల్యం

మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాల్లోని నిఘా నేత్రాలను పోలీస్ శాఖ సమక్షంలో ఏర్పాటు చేశారు. టెక్నాలజీ పెరిగిన తరుణంలో ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. కానీ, మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ఉన్న సీసీ కెమెరాలు నిర్వహణ లోపంతో పనిచేయడంలేదు. దీంతో గుర్తుతెయని వ్యక్తులు చోరీలు చేయడం చాలా సులభం అవుతోంది. తాళాలు వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే చోరీలు జరుగుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు బెంబేత్తుతున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఇటీవల చోరీల ఫిర్యాదులు

మండలంలోని రంగాపురం గ్రామ రైతు భట్టు సాంబయ్య తన వ్యవసాయ బావి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు స్టాటర్, బాక్సు, వైరు, డ్రిప్పు పైపులను దొంగిలించారని, రూ.20 వేలు నష్టం వాటిల్లిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మండల కేంద్రంలోని బాలాజీ కిరాణం షాపు యాజమాని కూస కర్ణాకర్ ఇంట్లో విలువైన బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని, దీని విలువ రూ.90వేలు ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల బిల్యానాయక్‌తండా, నందిగామ, రుద్రగూడెం తదితర గ్రామాల్లో జరిగిన చోరీలపై పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో చోరీల కేసులపై పోలీసులు నిఘా పెట్టడం తప్పడం లేదు.

ఆందోళనలో ప్రజలు

నల్లబెల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్కువగా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. అసలే వేసవి కాలం చోరీలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని, స్థానిక పోలీసులు సీసీ కెమెరాలతో పాటు, గ్రామాల్లో ఎప్పటికప్పుడు నిఘాను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

దొంగతనాలను అరికట్టాలి

కడియాల మనోహర్, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి, రుద్రగూడెం



మండలంలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టాలి. చెడు వ్యసనాలకు అలవాటు పడి చాలా సులువుగా డబ్బు వస్తుందనే భావనతో కొందరు వ్యక్తులు చోరీలకు పాల్పడడం సరైంది కాదు. గ్రామాల్లో యువతకు మంచి, చెడులపై అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలి. దీంతో కొంత మేరకు మానసిక బుద్ధితో పాటు మంచి ఆలోచన శక్తి పెరుగుతుంది. పోలీస్ శాఖ దొంగతనాలు చేస్తే ఏలాంటి చట్టపరమైన శిక్షలు పడుతాయే ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాలి.

చట్ట పరిధిలో నిఘా పెంచుతాం

రామారావు, ఎస్సై, నల్లబెల్లి



మండల ప్రజల శాంతి భద్రతల క్షేమం దృష్ట్యా చట్టపరిధిలో నిఘాను పెంచుతాం. చోరీలు చేసే వ్యక్తులను త్వరలోనే గుర్తించి, చట్టపరమైన శిక్షలను వేస్తాం. మండల ప్రజలు ఏలాంటి భయభ్రాంతులకు గురి కావాల్సిన అవసరం లేదు. పోలీస్ శాఖ ప్రజల శాంతి భద్రతలను కాపాడుతుంది. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని సీసీ కెమెరాలను పనిచేసే విధంగా సరిచేస్తాం. చోరీలు జరిగిన వెంటనే ప్రజలు డయల్ 100కి ఫోన్ చేసి, పోలీసులకు సహకరించాలి. చోరీలు జరుగుతున్న గ్రామాల్లో పోలీస్ సిబ్బందితో నిఘాను పెంచుతాం. చట్ట పరిధిలో ప్రజల స్వేచ్ఛను కాపాడుతాం.